నీడలు

పది గంటల రాత్రి.

సూర్యం తప్పించి మిగతావారంతా గది వెనక నడవలో పడుకున్నారు. గదంతా గలీజుగా ఉంది. సర్ది కట్టిన సామాన్లు అడ్డదిడ్డంగా పడి ఉన్నాయి.

గది మధ్యని ఒక తాటాకుల చాపమీద ఒక పాతకాలపు సందుగు పెట్టె, మినుకు మినుకుమనే ఒక చేతి లాంతరూ ఉన్నాయి. సూర్యం కూడా వున్నాడు.

"పెళ్ళాం పిల్లలూ, డబ్బా డవాలా! కొన్నాళ్ళు కట్టుకట్టుకొని తిరగడం, చివరకి ఎక్కడో అక్కడ విడిపోడం" అనుకున్నాడు సూర్యం, సాధారణంగా అటువంటి సందర్భాల్లో అందరూ అనుకొనేట్టుగానే.

దాదాపు ఇరవై సంవత్సరాలు, ఓ కంపెనీవాని ఆఫీసులో, ముక్కవాసన వేసే గదిలో, వెల్తురు అందని ఒక మూలని కూర్చొని టైపిస్టుగా పని చేసిన వెంకట సూర్యం ఒక ఏడాదినుంచి ఆ పని చెయ్యడంలేదు.

కంపెనీ వుంటేకదూ, అందులో పనిచెయ్యడానికి?

ఎక్కడో ఎవడో మోసం చేస్తాడు. ఎక్కడెక్కడో, ఎందరెందరో దెబ్బ తింటారు. మంచు మాయమయినట్టుగా కంపెనీ దివాలాతీసి మాయమయింది. వెంకట సూర్యం వీధిని పడ్డాడు.

తరువాత ఈ సంవత్సరమంతా ఎలా గడిచిందో భగవంతు డెరుగును. అంతా ఒక యుగంలా నడిచింది. ఒక పీడకలలా గడిచింది.

మరింక దాని గురించి ఆలోచించి వగచి ప్రయోజనం లేదు.

"మన పరిస్థితి ఇంకా నయమే."

ఏదో మళ్ళీ ఓ ఉపాధి అంటూ ఒక ఏడాదికైనా దొరికింది. ఒడ్డున పడేసిన చేపల్లా ఇంకా కొట్టుకుంటూనే వున్నారు మిగతావాళ్ళంతా.

కొత్త నౌఖరి దొరికిందన్న మాటేకాని ఎక్కడ దొరికిందంటారు ?

మూడువందలమైళ్ళ దూరంలో.

ఉడుకురక్తం ఉన్నప్పుడు "ఎక్కడైతేనేం ?" అనిపించేది. అప్పుడు ధీమాగా కాలం గడపగలిగేవాడు. అంతా అడ్వెంచరస్‌గా ఉండేది. ఇప్పుడు ఏదో ఒక రస్తాని బండీ లాగడం అలవాటైపోయింది. అందులోనూ పోయేకాలమే కాని వచ్చేకాలం కాదు. ఇటువంటప్పుడు పొట్టచేత్తో పట్టుకొని, బండెడు సంసారాన్ని ఈడ్చుకొని, ముక్కూ మొహం ఎరగని పరాయిదేశానికి, అంతదూరానికి పోవాలంటే గుండె బేజారెత్తిపోతోంది.

ఆలోచించి వగచి ప్రయోజనంలేదు.

తిండికోసం పశువులు కొండలకైనా పోయినట్టు, ఎక్కడకైనాసరే, ఎంతదూరానికైనా సరే, ఈ పిల్లా జల్లా, ఈ డబ్బా డవాలా, ఈ బాదరబందీ అంతా నెత్తిని వేసుకొని "అల్లో లక్ష్మణా" అనుకొని పోవలసిందే.

కానీవయ్యా, ఏం చేస్తాం !

పనికొచ్చేవైనా మోసుకు వెళ్ళలేనివన్నీ అమ్మి పారేశావు కదా. విలువగల వస్తువులకి కాళ్లొచ్చి ఏనాడో ఇంట్లోంచి నడిచిపోయాయి కదా. ఆనాడు చెమటోడ్చి సంపాదించగా మిగిలినవో, ఈనాడు చెయ్యిజారి తెచ్చినవో, లేక గిన్నే ముంత అమ్మగా వచ్చినవో, ఏవో నాలుగు రాళ్లున్నాయి కదా. రేపు సాయంకాలం ఆ నలుగురు పిల్లలూ, నువ్వూ, నీ ఆడదీ టిక్కెట్లు కొనుక్కొని సామాన్‌తో సహా గాడీ ఎక్కేస్తారు. ఎల్లుండి అక్కడెక్కడో దిగుతారు. ఏ చెట్టుకిందో, ఏ సత్రంలోనో మకాం పెడతావు. అక్కడ మరో చీకటి కొట్లో నువ్వూ నీ టైపుమెషీనూ, తయారు.

బతక్కపోవు ఫరవాలేదు.

బతక్కపోయినా ఫరవాలేదు, నీ పెళ్ళానికీ పిల్లలకీ తప్పించి.

ఇహ, నీ తరవాతవాళ్ళ మాటా-అడుగుతావు ?

అంతటా వినిపించే పాట విన్నావుకదూ. "ఎవరికి వారే యమునా తీరే."

రాత్రి పదిగంటలకే అయింది; నిశ్శబ్దంగా ఉన్నది గది. ఎర్రగా, నిశ్శబ్దంగా ఏడుస్తున్నవి గది గోడలు. మూలనున్న సామానంతా పైకి తర్లి

పొవడంచేత, ఏళ్ళ తరబడి భద్రంగా దాగున్న చెత్తా చెదారం అంతా ఎక్కడిదక్కడే, ఏం చేయాలో తోచనట్టు, ఉండిపోయింది. తారు పూసిన రెండు సీనారేకు పెట్టెలూ, ఆకుపచ్చరంగు పులిమిన ఒక దేవదారు పెట్టే, ఒక గోనెమూటా, కొబ్బరి తాళ్ళమడతల్లో మూలుగుతున్నాయి.

సూర్యానికి నిద్ర రావడంలేదు. అతనికి సంబంధం ఉన్నంతమట్టుకు ఆ వూరి కథ ఆఖరి రాత్రి.

"ఈపాటికి రేపు పాసెంజర్లోనూ, ఎల్లుండి మరో వూళ్లోనూ ఉంటాం. ఇవాళ, రేపు, ఎల్లుండి. క్యూ నడుస్తోంది. కాలం పరిగెడుతోంది" అనుకొంటూ సందుగుపెట్టె తలుపు తెరిచేడు సూర్యం.

అందులో ఏవేవో ఎన్నెన్నో కాయితాలున్నాయి. నాల్రోజులు ఉంచవలసిన కాయితం ఏదైనా సరే అందులో ఉన్నదన్నమాటే.

ఈ కాయితాలేమిటో చూసి, పనికిరానివేవో అంటించి పారేయవచ్చు. అబ్బా, ఎన్ని కాయితాలున్నాయి!

ధూళిపట్టినవి, పురుగులు కొట్టినవి పైకి తీస్తూంటే చాలా కాయితాలు వస్తున్నాయి.

ఉత్తరాలు, ప్రత్యుత్తరాలు, బిల్లులు, రశీదులు, సర్టిఫికెట్లు, తాఖీదులు, చిరునామాలు, పూర్తి పరిష్కారం చేసిపుచ్చుకున్న ప్రోనోట్లు, లాయర్లు పంపిన ప్రత్యుత్తరాల నకళ్లు, అంకెలు, పద్దులు, మనియార్డర్ల రశీదులు, శుభలేఖలు, వగైరా వగైరాలు. ఒకటీ ఒకదాని వెనక ఒకటీ వస్తున్నాయి తీస్తూంటే.

ఇదేదో జాతకచక్రం.

సంవత్సరం, మాసం, తిథి, వారం, నక్షత్రం, నక్షత్రపాదం, ఘడియలు విఘడియలు, లగ్నం, దశాశేషం.

ఎవరిది?

చిరంజీవి వెంకటసూర్యనారాయణ జాతకచక్రం ఇది.

పొగబట్టిన గోడలకి వేసిన సున్నం ఆరగా వచ్చేరంగులా పాతగా ఎర్రగా ఉంది కాయితం. నాలుగువైపులా పసుపు. మధ్యగా పసుపులో శ్రీకారం. శుభం శుభం.

సూర్యం పుట్టినప్పుడు తాత వేయించిన చక్రం కాబోలు. తాటాకుల మిద్దెయింట్లో, మా సమీపం దగ్గర కూర్చొని, చుట్ట కాలుస్తూ ఏ పంతులో రాసి ఉంటాడు. వాసన చూస్తే పాతవాసన వేస్తోంది.

ఎంతటి పాతమనిషి ఈ వెంకటసూర్యం?

"ఈ అరువదియున్నూ తెలుగు సంవత్సరముల పేళ్లు" "ఈ పన్నెండున్నూ తెలుగుమాసముల పేళ్లు" అనే మాటలే తనకి జ్ఞాపకం ఉన్నవి. సంవత్సరాలవీ, నెలలవీ, పేర్లు మాత్రం ఎగిరిపోయేయి. ఇంగ్లీషు తేదీ గుర్తుకు తెచ్చుకోవాలిప్పుడు.

పుట్టినరోజు ఎప్పుడు వస్తుందో బాగా గుర్తుంచుకొని దానికోసం కాసుక్కూర్చొని, ఆ సుదినానికి స్వాగతించెప్పి, సాగనంపిన కాలం ఏ నాడో పోయింది. ఇప్పుడు అది ఏ రోజో, వస్తుందో లేక వెళ్లిపోయిందో గుర్తుకు తెచ్చుకోవాలి.

ఊఁ, అవును. మూడురోజులయింది సెప్టెంబరు ఇరవైదాటి. అంటే మనకి నలభైఅయిదేళ్ళు దాటేయన్నమాట.

కాలం పరిగెడుతోంది. కాయితం పాతవాసన వేస్తోంది. మరికొద్ది దినాలకి మనం ముసలికంపు కొడతాం.

అయితే నలభైఅయిదేళ్ళు వెళ్ళిపోయేయా?

వెళ్లేయి. వెళ్లకేం చేస్తాయి.

వెళ్ళిపోతోన్న ఈ యేళ్ళన్నీ ఎక్కడకి వెళతాయి చెప్మా.

ఏళ్లన్నీ ఏట్లోకి వెళ్ళాయి. మనమంతా కాట్లోకి పోతాం.

జాతకచక్రం చాపమీది కాయితాల్లోకి పోయింది. పెట్లోంచి మరికొన్ని కాయితాలు పైకి వచ్చేయి.

ఒక కవరు.

జల్లూరు బ్రాంచి పోస్టాఫీసు ముద్ర పక్కనే జలంధర్ కంటోన్మెంట్ పోస్టు ముద్ర. రెండవపక్క అడ్రెసు : AT. 17645. నాయక్ వెంకటరమణయ్య, నెం. 7, అనిమల్ ట్రాన్స్‌పోర్టు కంపెనీ, జలంధర్.'

కవర్లోంచి లాంతరు వెలుగులోకి భయపడుతూ వచ్చింది ఉత్తరం. పంధొమ్మిదివందల పదహారో సంవత్సరంలో సూర్యం మేనమామ సూర్యం

తండ్రికి రాసిన జాబది. "అయితే ఆ తరవాత కాబోలు, నాయన హవల్దారవడం, తరువాత చచ్చి చెడి జమేదారవడమూను."

ఉత్తరం నడుస్తోంది! "...అక్కయ్యకి పథ్యం పెట్టేను. మంచం మీంచి లేచి ఇంట్లో కొంచెం తిరగాడ గలుగుతోంది. చి॥ సూర్యం స్కూలుకి వెళుతున్నాడే కాని రెండురోజులయి జ్వరం తగుల్తోంది. వాడికూడా గాలి సోకుతుందేమోనని హడిలిపోతున్నాం. ఇది ఇలాఉండగా, మా చెల్లెమ్మ మా అమ్మని ఎందుకో రమ్మని కబురుచేసింది. నిల్చున్నపాటున మా అమ్మ అక్కడికి పరిగెట్టింది. ఇహ ఇంట్లో చాకిరీ చేసేవాళ్ళెవరూ లేరు. నా ఆడమనిషి ఎటువంటిదో నీకు తెలుసుగా. అందులోనూ దానికి ఎడపిల్ల. అందుచేత అన్నీ నేనే చూసుకొని చేసుకోవలసి వస్తోంది. నువ్వు సొమ్ము పంపిస్తున్నట్టు లోగడ రాసేవు. ఇంతవరకూ సొమ్మూ లేదు, నీ దగ్గరనుంచి మరే కబురూ లేదు. ఇక్కడ పరిస్థితులు ఎంత ఇరకాటంగా ఉన్నాయో నువ్వొక్కసారి వచ్చిచూస్తే తెలుస్తుంది..."

అక్షరాల నలుపు ఇప్పుడు తెలతెలపోతోంది. కాని, అప్పట్లో ఎంతో నల్లగా వెళ్ళిన ఈ అక్షరాల్ని చూసుకొని నాయక్ రమణయ్య ఏమనుకొని ఉంటాడు? ఊహించవచ్చు. కాని, గడచిన చిక్కులగురించి ఇంకా ఊహలెందుకు?

ఈ ఉత్తరాల్లోని ఈ పాత విచారాలన్నింటినీ చాపమీది చరిత్రలో కలిపెయ్. అంతా కలిపి అఖర్ని తగలెట్టవచ్చు.

కాయితాలకి మడతలు విడుతున్నాయి. మడతలు మళ్ళీ పడుతున్నాయి. చాపమీదికి వెళుతున్నాయి.

నాయనకి అమ్మ సాష్టాంగదండప్రణామంబు లాచరించి వ్రాయింపించిన ఉత్తరముల అంశములు. చి॥ వెంకటసూర్యాన్ని ఆశీర్వదిస్తూ బాగా చదువుకోమని చెప్తూ నాయన రాసిన జాబులు. మూడోఫారం క్వార్టర్లీ పరీక్షలో వచ్చిన మార్కులలిస్టు. ఇంగ్లీషులో ఇరవై; సైన్సులో పన్నెండు. "శనివారం మెయిల్లో వస్తాను. అన్ని విషయాలూ మాట్లాడుకోవచ్చు" అని ఎవరో ఎక్కణ్ణించో పంపిన కార్డు. ఉద్యోగానికి దరఖాస్తు పెట్టగా వచ్చిన ఒక జవాబు. జవాబు రాని ఒక అర్జీ. ఎవరిదో అడ్రెసు. ఏవో అంకెలు. ఇదేదో శుభలేఖ.

"...చిరంజీవి వేంకటసూర్యనారాయణను...చిరంజీవి సౌభాగ్యవతి రాజరత్నమ్మను యిచ్చి వివాహము జరిపించుటకు పెద్దలు నిశ్చయించినారు గాన, ఏతత్ శుభముహూర్తమునకు..."

పెద్దలు నిశ్చయించిన, ఒకనాటి నడిరాత్రి శుభముహూర్తాన్నే జరిగిన ఈ పెళ్ళిమాటకూడా తలపెట్టకూడదు.

మసిబొగ్గులా తయారైన రాజరత్నమ్మ రామనామస్మరణ చేసుకొని ఇప్పుడిప్పుడే పడుకుంది.

అన్ని పెళ్ళిళ్లూ శుభముహూర్తాల్లోనే జరుగుతాయి. కాదని ఎవరన్నారు.

వరసగా కాయితాల్ని చూడ్డమేకాని పూర్తిగా చదవకుండా మరికొన్ని కాయితాల్ని తీసి కిందని పడేసి "ఇంకా ఎన్ని ఉన్నాయి ?" అనుకొంటూ పెట్టెలోకి చెయ్యిపెట్టి తీసేసరికి సూర్యం చేతిలోకి పాత అట్ట ఒకటి వచ్చింది.

అట్టని దీపానికి దగ్గరగా పెట్టి చూసేడు సూర్యం.

'విరిగిన ఇటికలూ, రాలిన పెంకులూ తప్ప ఇంకేం ఉంటాయి' అనుకొని అడుగుపెట్టిన పాడుపడిన ఇంట్లో ఓ గదిలో గోడని రంగుల పటాలు-- పాతవే అనుకోండి — కనిపిస్తే ఆశ్చర్యపోయినట్టుగా ఆశ్చర్యపోయాడు సూర్యం తన చేతిలోని పాత అట్టని చూసి.

చూసేడు. కొంతసేపు చూసేడు. మరి కొంతసేపు చూసేడు. చాలా సేపు చూసేడు.

నెల దినాల కిందట ఒక పిక్చర్ చూశాడు సూర్యం. 'మనసేమీ బాగులేదు. పోనీ కాస్సేపు సినిమాలో కూర్చొని వద్దాం' అనుకొని బయల్దేరి వెళ్ళేడు. టిక్కెట్టు తీసుకొని హాల్లోకి వెళ్ళి కూర్చున్నాడు. లోపల ఎవడూ లేడు. హాలంతా శవాలకోసం ఎదురుచూసే స్మశానంలా ఉంది. చివరికి ఎలాగైతేనేం ఓ పాతిక శవాలు కాబోలు చేరాయి నెమ్మదిగా. దిప్పూ దిప్పూ మనే థియేటర్లో చాలాసేపు దిక్కులు చూస్తూ కూర్చోగా ఆట ఆరంభించేరు. ఆరంభించేక తెలిసివచ్చింది సూర్యానికి ఆ పిక్చరు తనిదివరకు చూసిందేనని.

ఇరవై సంవత్సరాల పై చిలుకు అయుండవచ్చు, ఆ చిత్రాన్ని మొదటిసారి చూసి. అప్పట్లో అది చాలా పాప్యులర్ పిక్చర్. తిరిగి చూస్తోంటే, "ఇదేనా అప్పుడు ఎంతో బావున్నదనిపించిన చిత్రం!" అని ఆశ్చర్యం కలిగింది. చనిపోయిన వారందర్నీ పిలిపించి తిరిగి తెరమీద కెక్కించినట్లుగా, మిక్కిలి బాధాకరంగా ఉంది.

అయ్యయ్యో ఇదేనా ఆ చిత్రం!

ఇందులో నటిస్తున్న వాళ్ళు కొంతమంది బతికే ఉన్నారు. ఇప్పటికీ సినిమాల్లో నటిస్తున్నారు. కాని, అప్పటికీ ఇప్పటికీ ఎంత మార్పు! ఇందులో ఎంతో పాతగా కనిపిస్తున్నారే కాని, ఎంత లేతగా ఉన్నారు! ఈ బొమ్మలో కనిపిస్తున్నట్టుగా వాళ్ళిప్పుడు లేరు. మళ్ళీ ఎప్పటికీ ఉండరు. కొంతమంది ఏదో విధంగా ఉండనైనా ఉన్నారు.

కాని, మిగతావాళ్ళంతా ఏరి?

రాణీగారి పెంకితమ్ముడి వేషం వేసిన కుర్రవాడే కొబోలు ఆమధ్య అకస్మాత్తుగా చనిపోయేడు. తాగుడువల్ల అయుండవచ్చు. రాజభటుల్తో మాట్లాడ్డానికి సరదాపడే ఆడపిల్ల వేషం వేసిన ఆడపిల్ల ఆ రోజుల్లో అందరికీ అభిమానతార. పెళ్ళిచేసుకొని, మరి పిక్చర్లేకుండా పోయింది. నవ్వు ముఖంతో నటిస్తున్న ఆ హీరో, ఆ సచివోత్తముడి కుమార రత్నం, అతనే ఈమధ్య ముసలి విలన్ పాత్రలు ధరిస్తున్నాడు. అష్టకష్టాలూపడే ఆ బానిస పాత్ర ధరించినవాడు మరింక తెరమీద తిరిగి కనిపించనేలేదు. హీరోయిన్‌గా నటిస్తున్న ఆ లేడీ ళ్ళ లేతపిల్లనే ఎవడో ఫిలిం ప్రొడ్యూసరు ఘోరంగా దగా చేయగా ఆమెకి ముఖం తిరిగి మతి చెడింది. దయగలవారెవరో చేరదీసి పోషిస్తున్నారు. అమాయకంగా అమిత విశ్వాసంతో పనిచేసే ఆ రాజాను చరుడి పాత్ర ధరించినవాడు ప్రస్తుతం ఈఊళ్ళోనే అడుక్కుతింటున్నాడు. మరి మిగతావాళ్ళంతా? ఏమో ఏమయారో! అంతా జేపికరే.

సుమారు ఇరవై సంవత్సరాల క్రితం ఆనాడు చూసినప్పుడు ఈ చిత్రమే ఎంతో బావున్నదనిపించింది. ఆనాటి రాత్రి సినిమా అయాక బైటికి వచ్చేసరికి వెన్నెల తడిగా, చల్లగా ఉంది. తువ్వాలు కప్పుకొని, కథలో, హీరోయిన్నీ, సరోవరం దగ్గర దృశ్యాన్నీ తల్చుకొని నడుస్తూంటే మనసంతా వెచ్చగా కరిగింది. ఉత్సాహంతో వళ్ళంతా వేడెక్కి తేలిక పడింది.

కాని, ఎంతో కాలం అయ్యాక, ఎప్పటివో అయినట్టి ఆ చిత్రాన్నే తిరిగి చూసినప్పుడు "అయ్యయ్యో" అనిపించింది. మనసుకి ఎంతో కష్టం తోచింది. ఏనాడో జరిగిపోయిన సంఘటనలో పాల్గొని ఎక్కడెక్కడికో చెదిరిపోయిన వ్యక్తులనందర్నీ బలవంతాన రప్పించి ఆ సంఘటననే తిరిగి జరిపించినట్టుగా ఉంది. అసలా సంఘటనే అర్థరహితం. అందులో పాల్గొన్న వ్యక్తులంతా అసమర్థులు. బొత్తిగా అనుభవం లేనివాళ్లు. వారికి చేతకాని, వారు చేయలేని పనులు వారిచేత బలవంతాన చేయించినట్టుగా ఉంది. వారు చేసే ఆక్రందనలా ఉన్నాయి వారు పాడిన పాటలు.

ఎందుకు వాళ్లనంతా అలా కష్టపెట్టడం? అర్థంలేని ఈ చిత్రాన్ని ఎందుకు తీయడం? చూసేవాళ్ళు ఎందుకు చూడ్డం?

లాంతరు వెలుగులో కనిపిస్తోన్న ఆ పాత అట్టమీది ఫోటో చూస్తోంటే నూర్యానికి అదేరీతిగా ఆలోచన వెళ్తోంది. అదేరీతిగా "అయ్యయ్యో" అనిపిస్తోంది. అదేరీతిగా కష్టంగా ఉంటోంది.

చాలా సంవత్సరాల క్రితం, ఒకరోజున, గోడని వేళ్ళాడే ఈ ఫోటో తాడు తెగి కిందపడింది. 'ఫ్రేం' విరిగింది. అద్దం బద్దలయింది. పిల్లలుతీసి పాడు చెయ్యకుండా రతనమ్మ తీసి ఈ పెట్లో పడేసి ఉండాలి తను దాని సంగతే మర్చిపోయేడు.

"ఇంటర్మీడియేట్ క్లాస్, ఫస్టియర్, 1926-27."

అని అట్టమీద ఉన్న అక్షరాల్లో, అంకెల్లో కొన్ని కనిపించకుండా పోయేయి. మిగతావి కనిపించకుండా పోతున్నాయి. అట్ట, చాలాచోట్ల, పిన్నలతో పొడిచినట్టు తూట్లు పడింది. ధూళితో నిండిన ఫోటో కాయితప్పు మెరుగంతా పోయింది. అంచులన్నీ పురుగు తినేసింది.

ఆ గదిలో, ఆ సమయంలో, ఆ లాంతరు వెలుగులో ఆ ఫోటో కూడా ఒక బతికి చెడ్డ మనిషిలా దీనంగా ఉంది. సాల్వేజ్ సామాన్లలోకి విసిరేసిన పనికిరాని పాత వస్తువులా ఉంది. వెల వెల పోతోంది.

ఫోటోలో వున్న అరవయ్యేడుగురు వ్యక్తులూ రకరకాలుగా ఉన్నారు. నవ్వుతున్నారు. నవ్వబోతున్నారు. సీరియస్‌గా ఉన్నారు. మూతులు బిగించి చూస్తున్నారు. నోళ్ళు తెరచుకొని కూర్చున్నారు. అంతా కూడా వెల వెల పోతున్నారు.

సున్నం లేని గోడలమీద లాంతరు వెలుగు అదృశ్యమైపోతోంది. ఫోటోమీద కూడా అంతే. అందుచేత లాంతర్ని కొంచెం దగ్గరగా లాగేడు సూర్యం.

ఇంటర్మీడియేటు మొదటి సంవత్సరపు ఆఖరి రోజుల్లో, సెలవుల ముందు తీసిన ఫోటో అది.

ఎలా ఉండేవి ఆ సంవత్సరపు తొలి రోజులు ?

ఎలా ఉండడం ఏమిటి ? ఆ సంవత్సరం అంతా కూడా తొలి రోజుల్లోనే గడిచిపోయింది.

నిజంగా ఆ రోజులు అంటూ ఎప్పుడైనా ఉండేవా ?

తెర. తెర వెనక తెర. దాని వెనక తెర. తెరలు తెరలుగా సంవత్సరాలు జరిగిపోయేయి. దూరంలో కనిపిస్తోంది చిన్నదిగా ముచ్చటగా కాలేజీ. కాలేజీలో కనిపిస్తున్నారు ఉత్సాహ పూరితులైన యువకులు.

నిర్మానుష్యంగా వున్నట్లనిపించే పాతకాలపు భవనాల్లో వరసగా పొడవుగా గది వెనక గదులుంటాయి. గదులన్నీ చీకటిగా వుంటాయి. గది గదికీ ఎదురెదురుగా వున్న తెరుచుకొన్న ద్వారంలోంచి దూరంలో ఒక చిన్న పెరడు కనిపిస్తుంది. అక్కడ తెల్లటి తులసికోటలో గుబురుగా పెరిగిన తులసిమొక్క వుంటుంది. ఒక పక్కకి పచ్చటి బంతిపూల మొక్కా దాని వెనకనే ఒక సన్నజాజి తీగా కనిపిస్తాయి. అక్కడ సీతాకోక చిలకలు ఎగురుతూ వుంటాయి. అక్కడ ఎండ పచ్చగా వుంటుంది. తులసికోటకి కొంచెం ముందుకి తళతళ మెరిసే ఇత్తడి బిందె ఒకటి బోర్లించి వుంటుంది. బిందెమీద కూర్చొని ఒక అందాల ఆడపిల్ల ఏదో ఆలోచిస్తూ వుంటుంది.

ఇంటి పొడవుకీ వుండే ద్వారాల్లోంచి, గదుల చీకటిలోంచి చూస్తోంటే ఆ పెరడు అతి నిశ్శబ్దంగా, ఎంతో మనోహరంగా, నిజంగా అక్కడ లేనట్టుగా, మూగ సినిమాలా, తెరమీద రంగు బొమ్మలా, నిద్రలో వచ్చిన సుఖమైన కలలా వుంటుంది.

ఆ తొలి రోజుల కాలం ఆ రీతిగానే కనిపిస్తోంది. చింకి చాపమీద, మినుకు దీపం దగ్గర కూర్చున్న సూర్యానికి ఆ సమయంలో.

రెండు సంవత్సరాలు దండయాత్ర చేసి మూడవ దండయాత్రలో "మెట్టు" దాటి ఇంటర్లో ప్రవేశించిన రోజులవి.

ఎన్నెన్నో కొత్త సుఖాలు కనిపిస్తాయనే వుత్సాహంతో కాలేజీకి వెళ్ళడం; కలకల్లాడే కాలేజీకి వెళ్ళేసరికి కొత్త కొత్త ముఖాలు కనిపించడం; అంతటితో ఆ వుత్సాహం ఇంకా ఎక్కువ అవడం—

బొమ్మల కొలువు పెట్టేముందు చెల్లా చెదురుగా పడేసిన బొమ్మల్లా వున్నారంతా. ఈ బొమ్మ రంగు బావుంది. ఆ బొమ్మ వేషం బావుంది. ఈ బొమ్మ ఎక్కడిది? ఆ బొమ్మ ఏ ఊరుది?

అందరితోనూ మాట్లాడాలని వుండడం; కొందరితో మాట్లాడ్డానికి మొహమాటం పడ్డం; తమ హైస్కూలునుంచి వచ్చిన వారంతా కలసి అల్లరి చేయడం; అంతా కోలాహలంగా వుండడం.

అదంతా కలకాదు. ఆ రోజులు నిజంగా వుండేవి. ఈ బొమ్మల్లో మనుష్యులు నిజంగా వుండేవారు.

ఈ లాంతరు వెలుగుల్లో ఈ తూట్లుపడ్డ పాత అట్టమీద కనిపించే ఈ బొమ్మలే, ఈ నీడలే ఆ రోజుల్లో కాలేజీలో ఎంతో గల్లంతు చేసింది.

యాభై వున్నాయి, గల్లంతు చేసిన నీడ బొమ్మలు.

మిగతావాళ్లు?

ప్రిన్సిపాల్, లెక్చరర్స్ అండ్ ప్యూన్స్!

ప్రిన్సిపాల్‌గారూ లెక్చరర్లూ దిగువని కుర్చీల్లో కూచున్నారు. వారివెనక, వారి ఎగువకి మూడు వరుసల్లో మిగతావారంతా ఉన్నారు. మీదివరసలో చెరోపక్కా, వంకపాగాలు పెట్టుకొని, మీసాలు దిద్దుకొని నిలుచున్నవాళ్ళిద్దరూ కాలేజీ ఆఫీసు బంట్రోతులు. ఎడమవైపు నిలుచున్న వాడు ఫొటోలో కొద్దిగా చెదిరేడు కాని కాలేజీలో మాత్రం కదలకుండా స్తంభంవార నిద్రపోయేవాడు. ప్రిన్సిపాల్ పిల్చినా సరే బూతులు తిట్టుకోకుండా లేచేవాడుకాడు. రెండోవైపు నిల్చున్నాడే, అతడి కొడుకుమీదే ఆ రోజుల్లో ఏదో పోలీసు కేసు ఉండేది. అందుచేత ఇతనెప్పుడూ బెంగగా కనిపించేవాడు. ఆ కేసు ఏమయింది? ఆ కొడుకు ఎక్కడున్నాడు? ఈ ప్యూన్స్ ఇద్దరూ ఏమయేరు?

ముంగుండే కుర్చీల వరసలో మధ్యగా కూర్చున్న పెద్దమనిషి, కాలేజీ ప్రిన్సిపాల్. బుట్టపాగా. అంగారుబొట్టు. నవ్వుముఖం. లాంకోటు. పంచె. మేజోళ్ళు. బూట్లు. అప్పటికేకాని యాభయ్యేళ్ళుంటే ఇప్పటికింకా బతికిఉంటాడా? ఆ రోజుల్లో తన మనవరాలికోసం కాలేజీలో చదివే తన కులం పిల్లలందర్నీ పిల్చి భోగట్టా చేసేవాడు. ఆయన వెనకనే ముంగిలా ముఖం పెట్టుకొని నిల్చున్న 'లెక్కల కుర్రాడు' చివరికి ఆ పిల్లకి తాళికట్టి దానికొంప ముంచేడు. ప్రిన్సిపాల్ గారే కాని బతికిఉంటే, మనవరాలి పెళ్ళి గురించి తల్చుకున్నప్పుడు ఆయనముఖంలో నవ్వున్నది కనిపించబోదు.

ప్రిన్సిపాల్‌కి ఎడమవైపున ఏడుగురు లెక్చరర్లు, కుడివైపున ఏడుగురు లెక్చరర్లు. వారిలో ఎక్కువమందికి పాగాలూ, మీసాలూ, లాంకోట్లు, పంచెలు. అంతా భారీగా ఉండే మనుష్యులు. ఆ రోజుల్లో ఎంతో పెద్ద వాళ్ళలా, జీవితంలో బాగా పండిపోయిన వాళ్ళల్లా కనిపించేవారు. ఈ బొమ్మలో చూస్తే కొందరే ముసలివాళ్ళలా కనిపిస్తున్నారు. కొందరిది నడివయసు, కొందరిది యవ్వనం.

ప్రిన్సిపాల్‌గారికి కుడివైపున, కెమేరావైపు చూడ్డానికి భయపడి కాబోలు నేలవైపుచూస్తూ, సూటు తొడుక్కొని కూర్చున్నాయనే ఇంగ్లీషు లెక్చరరు. బొమ్మ చూస్తే ముప్పయ్యేళ్ళవాళ్ళా ఉన్నాడు. క్లాసువైపు చూడ్డానికి భయపడే కాబోలు, ఎటూ చూడకుండా ఏదోవిధంగా పాఠం గొణిగేసేవాడు. శ్రీరామచంద్రా, ఇతగాణ్నెందు కంతగా బాధపెట్టేవారా స్టూడెంట్సంతా ?!

కుర్చీల్లో ఒక చివరికి, ఎడమకి కూర్చున్న వారిద్దరికీ అరవపాగా లున్నాయి. మీసాలు లేవు. తెలుగువాళ్ళల్లా లేరు, కారు. ఆ ఇద్దరూ "ఫిజెక్స్ కెమిస్ట్రీలు". "మమ్మల్ని తిట్టండి, కావలిస్తే కొట్టండి. కాని అయ్యలారా, మమ్మల్ని బతకనివ్వండి" అన్నట్టుగా చేతులు కట్టుకొని, నోళ్ళు కొంచెం వేళ్ళాడవేసుకొని బెదురుగా చూస్తున్నారు.

ఇంగ్లీషు లెక్చరరు పక్కనే "క్రూరాత్మ దజామీళుడు" రీతిగా కని పించే ఆయనే జువాలజీ చెప్పలేని లెక్చరరు. వెడల్పు ఛాతీ, భయంకరమైన మీసాలు. సున్నపుతట్టలాంటి పాగా. అతను మిక్కిలి మంచివాడు, నెమ్మదైనవాడు. అతని దురదృష్టం ఏమిటో కాని అతనొక "పెళ్ళాల పులి"

అయిపోయేడు. పెళ్లాం రావడం, పెళ్ళాం పోవడం. ఆ రీతిగా అతని కప్పటికి ముగ్గురుభార్యలు చనిపోయేరు. తరువాత సాల్గవతూరి వచ్చిన భార్యే అతనిపాలిట పెద్దపులి అయింది. సూర్యం ఫూరే ఆమెది. ఆమె వచ్చిన తరువాత ఈ "పెళ్లాలపులి"నే బ్రెయిన్‌లో చూసి పోలికే పట్టలేకపోయేడు సూర్యం.

కుడివైపు చివరినుండి ఒకటవ, రెండవ కుర్చీలలో వరుసలో కూర్చున్నవారు తెలుగు, సంస్కృత పండితులు. లాంగ్‌కోట్లు, పంచలు, పాగాలు. సంస్కృతపండితునిది కొంచెం ముసలి ముఖం. కాని బాగుగా గీసిన ముఖం. మంచి తిథి, మంచి వారం, మంచి నక్షత్రం, అన్నీ మంచిగా జతపడిన ముహూర్తంలో వచ్చే మంగలి కత్తికోసం ఎదురుచూసే ముఖం తెలుగుపండితునిది. వాళ్ళిద్దర్నీ ఎవ్వరూ లెక్కచేసేవారుకాదు. "దేశభాషని తూలనాడే వారంతా చంకనాకి పోతారర్రా వెధవాయిల్లారా" అంటూన్నట్టుగా ఉన్నారు సంస్కృత పండితులు. "బావగారు బాగా సెలవిచ్చేరు. మాతృభాషని తూలనాడే వెధవల గతికూడా అంతే" అంటున్నట్టుగా ఉన్నారు ఆంధ్రభాషోపన్యాసకులు.

పండితుల పక్కనే టీ. బీ. తో బాధపడే హిస్టరీ లెక్చరర్ కూర్చున్నారు. అతని పక్కని కూర్చున్నందువల్ల టీ.బీ. ఎక్కడ అంటుకుంటుందో నసే భయంచేతనే అన్నట్టు ఊపిరి బిగబట్టి కూర్చున్నాయన లాజిక్ లెక్చరరు. అడుగో మాథమెటిక్స్ లెక్చరరు. మనుష్యుల్లో ఎద్దువంటివాడు. లెక్కల్లోకూడా అంతే.

లెక్చరర్ల వెనక మూడు వరసల్లో నిల్చున్నారు విద్యార్థులు-

ది అండర్ గ్రాడ్యుయేట్స్ !

మొదటివరసలో సేలని ఇరవయ్యొక్కమంది. ఆ వెనక బల్లలెక్కిన వారు పద్ధెనిమిది, ఆ మీదికి ఇంకా ఎత్తయిన బల్లమీద, బంట్రోతు లిద్దరూ అంగరక్షకులుగా చెరోపక్కా ఉండగా నిల్చున్న స్టూడెంట్సు పదకొండుగురు.

ఎవరు వీరంతా ?

వీరే ఆనాటివారంతా.

అలా చూస్తోంటే మనసులో చెరిగిపోతోన్న గుర్తులు మళ్ళీ కుదుటపడుతున్నాయి. పోలికలు దొరుకుతున్నాయి. వెనకటి భోగట్టాలు, సంగతులు, జ్ఞప్తికి వస్తున్నాయి.

దాదాపు ఇరవయ్యేడు సంవత్సరాల క్రితం, ఒకనాటి సాయంకాలం, కెమెరా క్లిక్ చేసిన అరక్షణంలో రకరకాలుగా నిల్చొని చూస్తోన్న వారంతా అలాగే నిలబడి ఇంకా అలానే చూస్తున్నారు.

ఎక్కువమంది పల్చటి లేత మీసాలవారు. కొంతమందివి ఫ్రెంచ్ కట్, ఒకనిది బొద్దు మీసం. కొంతమంది మిగతావారికంటె వయసులో బాగా పెద్దవాళ్ళు. ఆరోజుల్లో ఎంతో ఉత్సాహంగా వున్నవారే వీరంతా. ఆ ఛాయలు కొందరి ముఖాల్లో కనిపిస్తున్నాయి. ఎంతో అల్లరి చేసేవారు. వాళ్ళ అల్ప ప్రజ్ఞలకి గొప్పపడిపోతూ వుండేవారు. స్వల్పాతి స్వల్ప విషయాలకి తెగ ద్వేషించుకునేవారు. అందరూ కూడా మధురమైన కలలు కనేవారు. చిన్నవో పెద్దవో ఆశలు పెట్టుకొనేవారు.

వారిలో చాలామందికి పీడ కలలు తప్పించి కలలన్నీ ఎగిరిపోయేయి. ఆశలు అడియాసలయేయి. కాకపోతే ఆశలుగానే నిల్చిపోయేయి. కొంతమంది జీవితాలు మండి తగలబడ్డాయి.

అల్పమైనదే అనుకోండి, కాని, ఏమైపోయింది వారి ప్రజ్ఞ? ఏదీ వారి ఉత్సాహం? ఏరీ; వీరంతా ఎక్కడున్నారు? ఏ మారుమూలలో ఇరుక్కున్నారు? ఏ విధంగా బతుకుతున్నారు? ఏ ఏ విధాల బతకలేక చస్తున్నారు? ఒక్కొక్కర్నీ చూసి, అందర్నీ ఒక్కమాటుగా, మధ్య మధ్య ఒక్కొక్కక్కర్ని ప్రత్యేకంగా, అందర్నీ మళ్ళీ మళ్ళీ చూస్తున్నాడు సూర్యం.

మీది వరసలో రెండు ఫెజ్ టోపీలు కనిపిస్తున్నాయి. ఒకతను ఏదో ఖాన్ పద్యాలు బాగా చదివేవాడు. ఈమధ్య అమదాలవలస స్టేషన్లో శవాకారంలో ప్రత్యక్షమయేడు. రెండో అతని పేరు ఏదో ఆచారి. 'క్లాసులో ఒక గర్ల్ స్టూడెంటైనా, ఆఖరికి మన సీనియర్స్‌కి వుండేలాటి కాకిలాటి పిల్లయినా లేదుకదా' అని ఎప్పుడూ గోలపెట్టేవాడు. అతనికిప్పుడు ఆరుగురు ఆడపిల్లలు. 'ఛస్తున్నానుకో భాయీ' అని ఒకసారి కనిపించినప్పుడు చెప్పేడు. ఎక్కడో ఏ అరవై డెబ్బై రూకలకో అరవ చాకిరీ చేస్తున్నాడు. మధ్య వరసలో తెల్లటి టోపీ పెట్టుకున్న కుర్రవాడి

పేరు ? రామారావ్. ఆ రోజుల్లో వాళ్ళ నాన్న "కాంగ్రెస్‌లో కలిసి పోయే" డని ఆ మధ్య ఎవరో చెప్పేరు. ఆ వరసలోనే అతని పక్కనే వస్తాదుల్లా నిల్చున్న ముగ్గురూ బంతాట బాగా ఆడేవారు. వాళ్ళ పక్కని నిల్చున్న ఆరుగురూ పిలకలకి తాళ్లు కట్టుకొని ముగ్గురేసి చొప్పున "కంబైన్డ్ స్టడీస్" చేసేవారు. పరీక్షలకీ, వాళ్ల ప్రాణాలకీ లంకె. ఇవివి పాసవకపోతే వాళ్ళకి మరే ఆధారం లేదు చదువుమీద బ్రతకవలసినవాళ్లు చచ్చేట్టు చదవక తప్పదు. ముందు వరసలో ఎడమ చివర గుండులా ఉన్నవాడికి చదువు సంధ్యల్తో పనిలేదు. వాళ్ళు అప్పట్లో ఇద్దరు ముండలుండేవారట. ఆ వరసలోనే రెండవ చివర నిల్చున్నవాని గుండె కనిపిస్తోందికాని పిలక కనిపించడం లేదు. ఆ పంతులుకి అప్పటికి ముగ్గురే పిల్లలు. ఆ వరసలోనే అతని పక్కగా వరసగా ఈవెనింగ్ డ్రస్‌లో నిల్చున్న అయిదుగురూ అయిదుగురు మనుష్యుల కొడుకులు కారు. అయిదుగురు ఆఫీసర్ల కొడుకులు. వాళ్లలో వాళ్ళకి పడకపోయినా సైకి కలిసి కట్టుగా తిరిగేవారు. అదేవరసలో మూంగి ముఖంవాసి కుడిపక్కని ఏమీ ఎరగనట్టు నిల్చున్న ఈడురాని కుర్రవాడు పెద్ద చదువుకి ఇంగ్లాండు వెళ్ళేట్ట, పెళ్ళాడ్డం 'దొరసాన్ని' పెళ్ళాడేట్ట. ఇప్పుడు ఇరాన్‌లోనట పనిచేస్తున్నాడు. అతిగాడి పక్కనే వున్నవాడు పల్చగా వున్నాడు. బేలగా చూస్తున్నాడు, అతను హాస్టల్లో చివరి గది కిటికీలోంచి ఎల్లప్పుడూ సముద్రంలోకిచూస్తూ ఉండేవాడు. బొద్దు మీసాలవాడు-మీదివరసలో మధ్యకి నిండుగా నిల్చున్నాడు. అతను, పాపం, మిక్కిలి అమాయకుడు. అతని ఎడమపక్కని నిల్చున్న అతని ప్రాణస్నేహితుడిది దొంగముఖం, దింపుడుచూపు. వాడిపక్కనే నిల్చున్నవాడు పల్చగా పొట్టిగా పిల్లిలా కనిపిస్తున్నాడే కాని అతనికి కనపడ్డ ఇంగ్లీషువాణ్ణల్లా కాల్చేద్దామన్నంత కోపం ఉండేది. అతనికి ఎడమగా నిల్చున్నవాడు, కాలేజీలో ఏ మీటింగు జరిగినా తన పిల్లిగొంతుకతో ప్రార్థనపాట పాడి తీరవలసిందే. వీరిలో ఎవరోకాని ఒక కవి ఉండాలే. కనిపించడేం ?

లాంతరు వెలుగు తగ్గుతోందా అని అటువైపు అనుమానంగా చూసి ఫొటోని దీపానికి ఇంకొంచెం దగ్గరగా పెట్టిచూసేడు సూర్యం.

ఫొటోలో ఉన్నవారిలో చాలామంది ఉత్సాహంతో, ఏ కొద్దిమందో కొంత భయంతో, మొత్తంమీద అందరూ కూడా ఎక్కువ క్యూరియాసిటీతో చూస్తున్నారు.

"వారి భవిష్యత్తులోకి కాబోలు"

మా జీవితాల్లో ముందుకి ఏం జరుగుతుంది? ఏం జరుగుతుందో ఏమైనా కనిపిస్తోందా? అన్నట్టుగా అంతా చూస్తున్నారు.

ఆగకుండా ఎక్కడికో వెళ్ళిపోతోన్న కాలంలోంచి లాగి నిలవేసి ఈ ఫోటోలో ఈ రీతిగా బంధించిన ఆ ఆగిపోయిన ఆ ఒక్క అరక్షణంలో తమ భవిష్యత్తులోనిది ఏం కనిపించినట్టు వారికి?

నిజం కనిపిస్తే ఇలా ఉండరే వీరంతా!

ఆ నాటి సాయంకాలం వారికి చాలా విషయాలు కనిపించి ఉండవు. ఎన్నో సంగతులు తెలిసిఉండవు. ఊహించుకొనైనా ఉండరు. ఆ రోజు తరువాత ఈ మధ్యకాలంలో వారి జీవితాల్లో జరిగినవి, తాను తెలుసుకొన్నవి, చాలా విషయాలు స్ఫురణకి వచ్చాయి సూర్యానికి.

తన కొడుకుమీద కేసు ఏమవుతుందో, ఆ ఆఫీస్ ఫ్యూన్‌కీ; తన మనవరాలి గొంతుకోసేవాడు తన వెనకనే ఉన్నాడని, ప్రిన్సిపాల్ గారికీ; పెద్దపులి తన నాలుగో పెళ్లాం రూపంలోకి వస్తుందని, ఆ జూఆలజీ లెక్చరర్‌కీ; తిండిలేక చస్తానని, మధ్యవరసలో ఉన్న అపాడవాటి కుర్రవానికీ; ఈర్ష్యతో, కావేషితో, కక్షకట్టి తన కుడికాలు విరగ్గొడతారని, ముగ్గురినీ మధ్యనున్న ఆ ఫుట్‌బాల్ ఛాంపియన్‌కీ; బికార్నయి బిచ్చమెత్తుకుంటానని, పైవరసలో పిల్లిలా కనిపించే పసుచువానికీ; లోకాని కొక ఆఖరి ఉత్తరంరాసి ఆత్మహత్య చేసుకొంటానని, కిటికీలోంచి ఎప్పుడూ సముద్రంలోకి చూసే ఆ పల్చటి పిల్లవానికీ, మూడోకూతురు ముండమోస్తుందని, ఆ పిలకపంతులుకీ; ఆరుగురూ ఆడపిల్లలే పుడతారని ఆ ఆచారికీ; వర్క్‌షాప్‌లో కుడిచెయ్యి తెగిపడుతుందని, రెండోవరసలో నలుసులా నిల్చున్న చిన్నవానికీ; పక్కనే నిల్చున్న తన ప్రాణస్నేహితుడే తన భార్యని చెరుపుతాడని, ఆ బొద్దు మీసాలవానికీ—

తెలియవు. ఆ సాయంకాలం ఆయా విషయాలు వారెవ్వరికీ తెలియవు.

ఏమి జరుగుతుందని చూస్తున్నారో ఆ కాలం అప్పుడే చాలామట్టుకు జరిగిపోయింది. వారెదురుచూస్తోన్న ఆ భవిష్యత్తు వారిలో చాలామందికి పెనుభూతం అయింది.

"ఈ కుర్రవాడికూడా అంతే"

చివరివరసలో కుడివైపు 'బంట్రోతు' పక్కనే నిల్చొన్న కుర్రవాడు చేతులు కట్టుకొని, తలకొంచెం ఎత్తి "ఏముంది నా జీవితంలో?" అన్నట్టుగా, మిక్కిలి కుతూహలంతో చూస్తున్నాడు. కుడివైపుకి ఎత్తుగా లేచిన క్రాఫింగు పక్కలకి సాగ్గాజారిన కనుబొమలు, కొంచెం విప్పారినకళ్లు,కిందికి దిగుతూ ఎత్తుగా లేచిన ముక్కు. ఒక్క రవ తెరుచుకొన్న నోరు. ఏం కనిపించింది. ఆ సమయంలో ఆ కుర్రవాడికి ?

ఏం చూసేడో !

కాని, ఆ క్షణంలో, భవిష్యత్తులోకి చూస్తోన్న అతడి కళ్ళకి టైపు మెషీనులు మాత్రం కనిపించి ఉండవు.

ఊఁ హూఁ ! అవి కనిపించలేదు.

అంతే కాదు.

తల తిరుగుడు సుబేదార్ మేజర్‌కి లెంపకాయలాగిన తనతండ్రి జెయిలుకి పోతాడనీ, అంతటితో ఆ యేడే తను చదువాపవలసి వస్తుందనీ, ఆ వెంటనే టైప్ రైటింగ్ నేర్చుకోవలసి ఉంటుందనీ, ముక్కవాసన వేసే గదుల్లో ఉద్యోగం చేయక తప్పదనీ, తాళికట్టి తెచ్చుకున్న పువ్వులాంటిపిల్ల, వత్తిలా ఎండిపోతుందనీ, ఇద్దరుపిల్లలు ఎలా వచ్చినవాళ్లు అలానే పోతారనీ, ఇంట్లో నోళ్ళన్నీ ఎప్పుడూ తెరుచుకొనే ఉంటాయనీ, కంపెనీలచేత మనుష్యులు దివాలా తీయిస్తారనీ, నడివయసు దాటేక నట్టడవిలో కొత్తకాపరం పెట్టవలసివస్తుందనీ......

చాలా విషయాలు కనిపించలేదు. చాలా భోగట్టాలు తెలియవు ఆ కుర్రవాడికి ఆ సాయంకాలం.

పదిగంటలరాత్రి చాలాసేపయింది దాటిపోయి.

ఫోటోలో ఆ కుర్రవాణ్ని కొంతసేపు చూసి, సందుగుపెట్టె మూతకి లోపలిభాగంలో ఉన్న కళాయిపోయిన అద్దానికి ముఖాన్ని దగ్గరగా పెట్టుకుని ఒక్కసారి చూసుకొన్నాడు.

చూసుకొని "అయ్యో ! పోలికలేదు" అనుకున్న నరాయ్యానికి జ్ఞప్తికి వచ్చింది ఒకవిషయం.

గుంపులుగుంపులుగా చేరిన జనమంతా గుండ్రంగా నిల్చొని చూస్తూ ఉంటారు. కళ్ళకి గంతలు కట్టుకొని, మధ్యని కూర్చున్న కుర్రవాణ్ని, నాటుఫిడేలు వాయించడం టక్కున ఆపిన గారడీవాడు వేస్తాడు ప్రశ్న.

"అబ్బాయ్! సూర్యకళా? చంద్రకళా?"

గారడీవాని ప్రశ్న. గుంపులో కుర్రవాడి కెదురుగా నిల్చొన్న వెంకటసూర్యం చెవుల్లో గింగురుమంది. ఇప్పటికీ గింగురుమంటోంది.

ఏమంటాడు ఆ కుర్రవాడు? తనని చూపిస్తే ఏమంటాడు?

"ఉస్తాద్! సూర్యకళా కాదు. చంద్రకళా కాదు. ఇది ప్రేతకళ."

ఫోటోని మరొక్కసారి చూసి, దాన్ని పక్కగా పెట్టి నిట్టూర్చిన వెంకటసూర్యం, పెట్లోంచి మిగతా కాయితాల్ని మెల్లగా తీయనారంభించేడు.